
# పాపమ్మ బావి

పుట్ల హేమలత

మార్చినెల మొదలయిందో లేదో ఎండ తీవ్రత బాగా పెరిగింది. చెమటలు కక్కుకుంటూ పరుగులు తీస్తోంది నేనెక్కిన రైలు.

నెల్లూరు రైల్వేస్టేషన్‌లో బండి దిగి బయటికి వెళ్లటానికి 'టన్నెల్ వే' లోకి ప్రవేశించాను. అక్కడ చీకటి



**పారదోలటానికి ట్యూబ్ లెట్లు విశ్వప్రయత్నం చేస్తున్నాయి. నా చిన్న ప్పట్నుంచీ ఈ సొరంగంలో నడవడం నాకు ఒకింత బెరుగ్గా, మరికొంత ఆసక్తిగానూ వుంటుంది.**

చిన్నప్పుడు అమ్మ నాన్నల చెయ్యిపట్టుకుని ఈ దారిలో నడుస్తుంటే విఠలాచార్య సినిమాలోని రాక్షసుడు అమాంతం ఎదురుగా ప్రత్యక్షమై కత్తి చూపించి మమ్మల్ని బెదిరిస్తాడేమోనన్పించేది. మరో పదేళ్ల తర్వాత ఇదే దార్లో వెళ్లేటప్పుడు నా ఆలోచనలు మరోరకంగా వుండేవి.

సినిమాల్లోని విలన్లూ, కోరమీసాలూ, గళ్ల లుంగీ, మెడలో ఎర్రటి గుడ్డా, చేతిలో బ్రాందీ సీసా, కిడ్నాప్ ఎట్సెట్రా... ఎట్సెట్రా...

అప్పటి భయాలకు, ఆలోచనలకూ నాలోనేను నవ్వుకుంటూ రెండో మలుపు దగ్గర ఆగి ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాను.

నడుం వంగిపోయిన ముసలావిడ టిక్కు టిక్కుమంటూ కర్ర పోటేసుకుంటూ వస్తోంది.

నేను ట్రాలీ సూట్‌కేస్ లాక్కుంటూ ముందుకు కదిలాను. మరుక్షణం నా వెనుక ఏనుగులు ఘీంకరించినట్టు అరుపులు సొరంగంలో సుడులు తిరిగాయి. ఒక్క క్షణం ఏమీ అర్థం కాలేదు.

కళ్ల ముందు రాక్షసుడూ, విలన్, కోరమీసాలు, కిడ్నాప్... అన్నీ ఫాస్ట్‌గా రీవైండ్ అవబోతుండగా చివ్వున వెనక్కి తిరిగి చూశాను. ముగ్గురు కుర్రవాళ్లు గట్టిగా అరుచుకుంటూ, నవ్వుకుంటూ, ఒకరిమీద ఒకరు పడుతూ, ఈలలు వేసుకుంటూ పరుగులు తీస్తున్నారు.

గట్టిగా నిట్టూర్చి వాళ్ల వెనకే ముందుకు కదిలాను.

* * *

ఆటోలో ఆర్టీసీ బస్టాండ్‌కి వెళ్లి ఉష వాళ్ల ఊరెళ్లే బస్సెక్కి ఖాళీగా వుండటంతో కిటికీ పక్కన కూర్చున్నాను. ఇంకా డ్రైవర్, కండక్టర్ రాలేదు. ఎదురుగా వున్న షాప్‌లోని కుర్రాణ్ణి పిలిచి ఒక మేగజైనూ, ఓ మినరల్ వాటర్ బాటిల్ తీసుకున్నాను. పుస్తకాన్ని అలవోకగా తిరగేసి బ్యాగ్‌లో పెట్టాను.

క్రమంగా బస్‌లో జనం నిండారు.

కండక్టర్ "టికెట్ టికెట్" అంటూ వెనకనించి అరుచుకుంటూ టికెట్లిస్తున్నాడు.

బస్ మెల్లగా కదిలింది.

నా పక్కన కూర్చున్నావిడ ఉలిక్కిపడ్డట్టు లేచి కిటికీలోంచి తల బయటికి పెట్టి చూస్తూ "ఒరే సుబ్బరామడా! నేను లేనని అడ్డంగా తిని పొణుకోబాకరే. బర్రెల్ని చెరువులోకి తోలి సుబ్బరంగా కడక్కరా!"

గట్టిగా అరిచి చెప్పి కూర్చుంటూ పక్కావిడతో అంటోంది.

"ఈడు బలే యెదవ మే! ఆ యాల నేను పెంచలకోన తిరణాలకి పోతినే. అప్పుడేంజేసేడో తెల్సా? తోటకి బొయ్యి నిమ్మకాయలన్నీ కోసకొచ్చి అందరికీ పందేరం జేసేడంట. వోళ్లిచ్చిన చిల్లరడబ్బులు తీసకబొయ్యి రొండు సినిమాలు జూసొచ్చి నిగడదన్ని పొణుకోని నిద్రబొయ్యేడంట. ఆ రేత్రి ఏ దొంగనాబట్టో సూడి బర్రిని ఇప్పుకోని బొయ్యేడు. ఎన్ని తిప్పలు బడితే దొరికిందనుకున్నావ ఆ బర్రె!"

బస్‌లో అందరికీ విన్పించేలా పెద్దగా జెబుతోందామె.

"పెద్దమ్మో అదంతా నువ్విచ్చిన సనువేలే. చిన్నప్పుటాల్నుంచి నెత్తినెక్కిచ్చుకోని ఇయ్యాల నోరు లబలబా గొట్టుకుంటుండావే" వెనక సీట్లోంచి ఇంకొకామె దెప్పింది.

"ముందు టికెట్లు తీసుకోని ఆపైన యవ్వారాలు కానియ్యండి. డబ్బులు తియ్యవమ్మా గబాన"

కండక్టర్ కేకతో మాటలు కట్టిపెట్టి టికెట్స్ తీసుకోవడంలో నిమగ్నమయ్యారు.

'టికెట్' అంటూ నా ముందు చెయ్యి చాపి ఎక్కడికన్నట్టు ప్రశ్నార్థకంగా చూశాడు కండక్టర్. నేను డబ్బులిచ్చి ఎక్కడికో చెప్పాను. టికెట్ చిల్లర నా చేతిలో పెట్టి 'రైట్ రైట్' అంటూ ముందుకెళ్లిపోయాడు.

టికెట్ పర్స్‌లో పెట్టుకుంటూ బయటికి చూశాను.

బస్ అప్పుడే బస్టాండ్‌లోంచి బయటకొచ్చి రోడ్డెక్కింది. ఎదురుగా సర్వోదయా కాలేజీ ఆవరణలో అబ్బాయిలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నారు. అమ్మాయిలు తక్కువగా కన్పించారు.

బస్ ట్రంక్‌రోడ్ మీదుగా పరుగులు తీస్తుంటే మంచినీళ్లు తాగి వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాను.

* * *

దాదాపు ఇరవై సంవత్సరాల తర్వాత మళ్లీ నేను ఆ ఊర్లో అడుగుపెట్టబోతున్నాను. అది నేను పెరిగిన ఊరు. ఉషతో నా అనుబంధాన్ని పెంచిన ఊరు.

అప్పట్లో అమ్మా నాన్న ఉద్యోగరీత్యా అక్కడ ఉండేవారు. మొదట మేం కొన్ని రోజులు ఉష వాళ్లింట్లోనే అద్దెకుండే వాళ్లం. ఆ తర్వాత వాళ్ల పక్క స్థలంలోనే ఇల్లు కట్టుకున్నాం. దాంతో నాకూ ఉషకీ విడదీయరాని స్నేహం ఏర్పడింది. ఉష ఆ ఊర్లోనే వున్న స్కూల్‌లో ఏడోతరగతి చదువుతుండేది. నేను ఎనిమిదో తరగతి. నేను మాత్రం అంతకుముందు నుంచీ చదువుతున్న స్కూల్‌కే వెళ్లేదాన్ని. ఆ స్కూలు టౌన్‌లో వుండేది. నేనూ తమ్ముడూ చెల్లీ ప్రతిరోజూ టౌన్‌లోని స్కూల్‌కి వెళ్లి వచ్చేవాళ్లం.

అప్పట్లో ఆ ఊరికి బస్ సౌకర్యం లేదు. ఆటోలు కూడా లేవు. ఒకటీ అరా రిక్షాలూ పట్నానికి పనుల



## 'బాండ్' సినిమాల్లో నటిస్తోందా?

బాలీవుడ్ తార అందాల మాజీ సుందరి ఐశ్వర్యారాయ్ 'బాండ్' సినిమాలలో నటిస్తోందా? అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు స్పెషల్ జ్యూరీ మెంబర్‌గా వెళ్లిన ఐశ్వర్య హాలీవుడ్ సినిమాల్లో నటిస్తే ఆశ్చర్యమేముందని కొందరి వాదనకాగా, నటించచ్చు కానీ బాండ్ సినిమాలలోనా? అని మరికొందరు చర్చించుకుంటున్నారు. బాండ్ హీరోగా పేరుతెచ్చుకున్న ప్రముఖ హాలీవుడ్ నటుడు పీర్స్‌బ్రొస్నాన్ సరసన నటిస్తున్నట్టు వార్తలు గుప్పుమంటున్నాయి. కాగా ఐశ్వర్య ప్రముఖ కథానాయకిగా కాకుండా కేవలం సెక్స్ సీన్లలో మాత్రమే కనిపిస్తుందని మరికొందరు చెబుతున్నారు. ఏది నిజమో ఐశ్వర్యనే అడిగితే ఏదైనా వాస్తవం కావచ్చు కాకపోవచ్చు అని ముక్తసరిగా జవాబిస్తోంది.

కోసం వెళ్లే ఎడ్లబండ్లూ, సైక్లిస్ట్లూ తప్ప ఆ అయిదు మైళ్ల మట్టి రోడ్డుకి పెద్దగా రద్దీ వుండదు. కూరగాయలూ పళ్లూ అమ్ముకునే స్త్రీలు మాత్రం కాలినడకనే ఆశ్రయిస్తారు.

మేం స్కూల్‌కి వెళ్లి రావటానికి రిక్షా ఏర్పాటు చేశారు నాన్న. రిక్షా రామయ్య సెలవుపెట్టిన రోజుల్లో మేం సైక్లిస్ట్లను లిఫ్ట్ అడిగో, ఎడ్లబండ్లు ఎక్కో ఇల్లు చేరుకునే వాళ్లం. అదీకాకుంటే ఆడుకుంటూ పాడుకుంటూ నడిచేవాళ్లం.

టౌన్‌నుంచి మా ఊరికి మొదలయ్యే మట్టిరోడ్డు మీద నడవడం భలే గమ్మత్తుగా వుంటుంది. రోడ్డు మీద పదును దేరిన గులకరాళ్ల మీద నడుస్తుంటే కరకరమంటూ లయబద్ధంగా చప్పుడయ్యేది. రోడ్డుకి రెండువైపులా పచ్చని వరిపొలాలూ, అందులో కూనిరాగాలు తీస్తూ కలుపు తీసే స్త్రీలను చూస్తూ... తూనీగల్ని పట్టుకుంటూ ముందుకి సాగిపోయే వాళ్లం.

మరికొంతదూరం వెళ్లాక చిన్న నీటి తూములూ పక్కనే రెండు వెలగచెట్లూ వుండేవి. వెలగపళ్ల కోసం రాళ్లు విసిరీ విసిరీ వేసారి...

''అందుకే అందని వెలగపళ్లు కూడా పుల్లనే'' అనుకునే వాళ్లం.

రోడ్‌కి ఎడమవైపు మా వూరి వరకూ మౌనంగా ప్రవహించే పంటకాలువ అక్కడక్కడా గలగలమంటూ పరుగులు తీసేది. ఆ నీళ్లలో కాగితపు పడవలు వదులుతూ వాటికంటే ముందు వెళ్లాలని తమ్ముడు పరిగెత్తేవాడు.

ఒకసారి నేనూ ఉషా మా ఇద్దరి తమ్ముళ్లతో కలిసి ఈ పంటకాలువలోనే చేపలు పట్టాలని ఇంట్లో చెప్పకుండా వెళ్లాం. రోజంతా ఎండలో మాడి ఒళ్లంతా బురదకొట్టుకుపోయి ఇళ్లకు చేరిన మాకు సానుభూతి లేకపోతే పోయె బడితపూజ తప్పలేదు.

* * *

ఇప్పుడవన్నీ తల్చుకుంటూ వుంటే ఎంతో సంతోషం కలుగుతోంది. చిన్ననాటి తీపి జ్ఞాపకాలు మందార మాలలై మనసు మెడని చుట్టుకుంటూ వుంటే కొంచెం ఉద్వేగానికి గురవుతూ కిటికీలోంచి చూశాను. బస్ టౌన్ దాటి మా ఊరికి వెళ్లే మలుపు తిరిగింది.

ఉయ్యాల కాలువ లాకుల దగ్గర బస్ రెండు నిముషాలు ఆగింది. అక్కడ బొంతరాళ్ల వంతెన మీద ఇద్దరు యానాదులు చేపలు అమ్ముతున్నారు.

ఆ వంతెన నా బాల్యపు గుర్తు.

ఆ చుట్టుపక్కల ఎరుకల గుడిసెలూ, బంతిపూల తోటలూ ఏవీ లేవు. రియల్ ఎస్టేట్ల పుణ్యంతో అన్నీ పక్కాభవంతుల నిర్మాణాలు జరిగిపోయాయి.

నిస్పృహల మంచుతెరల మధ్య నా జ్ఞాపకాలు కూరుకుపోతుండగా బస్ కదిలింది.

ఏవీ మా వెలగచెట్లు?

ఏదీ మా పంటకాలువ?

మా అడుగుల సవ్వడికి తాళం వేసే గులకరాళ్ల బాట గుండెల మీద అడ్డంగా దూసుకుపోయిన ఎన్‌హెచ్-5 ఇన్నేళ్ల నా మధురమైన అనుభూతుల్ని వెక్కిరిస్తూ కొండచిలువలా మెలికలు తిరిగివుంది.

దారి పొడవునా పచ్చని పొలాలు లేవు. గణగణమంటూ పరుగులు తీసే ఎడ్లబండ్ల స్థానంలో ఆటోలు పడుతూ లేస్తున్నాయి. చుట్టూ ఎటుచూసినా నాది కాని తనం!

అసహనంగా కళ్లు మూసుకున్నాను.

పెళ్లి పేరుతో కాస్మోపాలిటన్ నగరానికి చేరిన నాకు ఈ ట్రిప్ కొంత ఉపశమనంగా వుంటుందనుకున్నాను.

ఉరుకులూ... పరుగులూ... మెషీన్లూ... డోర్ డెలివరీ భోజనాలు... లిప్‌స్టిక్ పెదాల నవ్వులు...

అన్నీ తప్పించుకుని ఈ ఊరి మట్టివాసన కోసం పరుగులు తీస్తున్నాను.

ఇరవైఏళ్ల విరామం తర్వాత నాకీ అవకాశం అనుకోకుండా వచ్చింది. నా కజిన్ కూతురికి విజయవాడలో పెళ్లి. బిజినెస్ వంకతో ఆయనా, చదువుల పేరుతో పిల్లలూ ఈ ప్రయాణం తప్పించుకున్నా నాకు తప్పదు కదా!

అప్పటికీ పదేళ్ల నా కూతురు వర్ష నాతో ఊళ్లు తిరగాలని చాలా ప్రయత్నం చేసింది. స్కూల్లో రివిజన్ టెస్ట్‌లకి సెలవు పెట్టకూడదని నియమం వుండటంతో ఆగిపోయింది.

''అమ్మా నీ చిన్నప్పటి ఊరు నాకు చూపించవా? నువ్వూ ఉషాంటీ ఫిష్ పట్టుకున్న వాటర్‌లో నేను కూడా ఫిష్ కోసం ట్రై చేస్తా'' అంటూ తెగ సంబరపడి పోయింది పాపం.

ఒకవేళ తనూ వచ్చివుంటే ఎంతో నిరాశ పడి వుండేది.

ఉష, నేనూ కొన్ని సందర్భాల్లో అక్కడక్కడా రెండు మూడు సార్లు కలుసుకున్నా ఈ ఊర్లో మేమిద్దరం కలుసుకోవడం మళ్లీ ఇప్పుడే. విజయవాడ వరకూ వస్తున్నాను కాబట్టి ఇలా ప్లాన్ చేశాను. బస్ మళ్లీ ఆగింది. మధ్యాహ్నం అవటంతో ఎండ పెరిగి చెమట్లు కారుతున్నాయి. మినరల్ వాటర్‌తో గొంతు తడుపుకున్నాను.

''ఒమోవ్ రవంత నీళ్లియరాదా గొంతెండి పోతావుందే'' పక్కన స్త్రీ అడిగింది.

వాటర్ బాటిల్ పైకెత్తి మిగిలిన నీటిని ఒకసారి చూసి ఆమెకిచ్చాను.



నీళ్లు ఒక్కగుక్కలో తాగేసి ఖాళీ సీసాని నా చేతికిస్తూ అంది...

''చెంబెడు నీళ్లు తాగితే దప్పిక తీరద్ది గానీ ఈ గుక్కెడు చుక్క ఏ మూలకి?''

సమాధానంగా చిన్న నవ్వు నవ్వి ఖాళీ సీసాని కిటికీలోంచి బయటికి విసిరేసాను.

రోడ్డు పక్కన ఆడుకుంటున్న ఇద్దరు అబ్బాయిలు ఆ సీసాకోసం పోటీపడుతున్నారు. నేను ముందు చూశానని ఒకడంటే, నేను ముందు తాకానని మరొకడు గొడవపడుతూ గిల్లుకుంటున్నారు.

రోడ్డుపక్కన అదుపు లేకుండా లీకవుతున్న కుళాయి కింద ఈ సీసాని పెట్టి నింపి ఒకరి తర్వాత మరొకరు నీళ్లు తాగుతూ మొత్తానికి రాజీ పడిపోయారు.

ఆ పసివాళ్లనలా చూస్తుంటే నాకూ దాహమేసింది. నీళ్లు దొరికితే బావుండనిపించింది.

ఇంకెంత? మరో పది నిముషాల్లో ఊరు చేరుకుంటాను. అక్కడ...


ఓహ్! నాకింకా తలపుకి రానేలేదు. అదే... పాపమ్మ బావి!

నేనూ ఉషా సెలవుల్లో గార్డెనింగ్ చేసేవాళ్లం. సాయంకాలాలు వాకిళ్లు తుడిచి నీళ్లు జల్లి ముగ్గులేసేవాళ్లం. బావికి వెళ్లి నీళ్లు తోడి మొక్కలకు నీళ్లు పొయ్యడం, కుండీలు నింపటం ఎంతో ఇష్టంతో చేసే వాళ్లం.

ఒక్కోసారి ఎండాకాలంలో నీళ్లు అడుగంటిపోతే మళ్లీ నీళ్లు ఊరేదాకా అక్కడే కూర్చోవాల్సి వచ్చేది. తెల్లవారుజామునే లేచి చప్పుడు చెయ్యకుండా నీళ్లు తోడుకొచ్చే వాళ్లం.

ఊరంతటికీ అదొక్కటే బావి మరి. అదే వర్షాలు బాగా పడ్డప్పుడైతే బావి నిండుగా తొణికిసలాడుతూ నీళ్లు చేతికందుతూ వుండేవి.

ఆ బావి గోడమీద ఒక శిలాఫలకం వుండేది. దానిమీద ''శ్రీమతి పాపమ్మగారి ధర్మం'' అని చెక్కిన అక్షరాలుండేవి.





ఒకరోజు చెరిగిన చీర తో, చింపిరి జుట్టుతో వీధుల వెంట తిరుగుతున్న ఒక వృద్ధురాలిని చూపించింది ఉష.

''అదుగో పాపమ్మంటే ఆమే. మన బావి తవ్వించింది ఆమే తెలుసా?'' అంది.

ఆశ్చర్యపోవడం నా వంతయింది.

''అవ్వా ఈ బావి తవ్వించింది నువ్వేనా?'' అపనమ్మకంగా అడిగాను.

పాపమ్మ ముడుతలు పడ్డ కళ్లను టపటపలాడించి తలూపింది అవునన్నట్టుగా.

''నిజ్జంగా?'' అన్నాను మళ్లీ.

''అవున్నాయనా! అప్పుడు మనూర్లో బాయి లేదు. ఊరోళ్లంతా మైలు దూరం బోయి నీళ్లు తెచ్చుకునే వోళ్లు. రెడ్డిగారి బాయికి మనోళ్లని రానియ్యరు. నా కొడుకులు కోడళ్ళు అడ్డం గొట్టినా నేను లెక్కజెయ్యాలా తల్లా! నేనూ మా ఆయనా కల్సుకోని ఆ బాయిని తవ్వినాం. అన్ని పన్లూ మేమే చేసినాం.

ఊరి రచ్చబండకాడ తవ్వితే ఊరందరికీ అందుబాట్లో వుంటది. పక్క రెండూళ్లకి మనూళ్లో నుంచే దార్లుండయ్యి. ఆ ఊర్లకి పొయ్యేవోళ్లూ, వచ్చే వోళ్లూ దప్పికైతే తాగతారని ఆశపడినా. ఏదో నేను కన్నుమూస్తే నా పేరు చెప్పుకుంటరు తల్లా!'' అంది తృప్తిగా.

అది ఒట్టి బావిమాత్రమే కాదు. నా ఆత్మ. నా నరాల్లో ప్రవహించిన ఉత్తేజం. నా ఆటలకీ పాటలకీ కబుర్లకీ నిలయం పాపమ్మ బావి. అంతేనా? నా తొలి ప్రాయపు అలల అద్దం కూడా!

అప్రయత్నంగా కళ్లు తడిదేరాయి.

బస్ ఆగింది.

జనమంతా బిలబిలా దిగుతున్నారు. కొంతమంది నన్ను ఆసక్తిగా చూస్తూ దిగుతున్నారు. ఈ బస్‌కీ నాకూ ఇదే ఆఖరి స్టాప్. అందరూ దిగాక నేనూ దిగాను. ఉష నాకోసం ఎదురుచూస్తూ ఉంటానంది. ఎక్కడా కన్పించలేదు.

పరిసరాల్ని పరికిస్తూ ఉత్తరేణి చెట్టుకింద నిలబడ్డాను. నా చిన్నప్పటి జ్ఞాపకాలను వాస్తవానికి జోడీ చేస్తూ నిలువెత్తు నిరాశలోకి జారిపోసాగేను.

రచ్చబండ మీద కొంతమంది పేకాడుతున్నారు. రోడ్డుపక్క పొలాల స్థానంలో కొన్ని డాబాలూ, ఒక దేవాలయం, చర్చీ, ప్రజా టెలిఫోన్లూ, చిన్న చిన్న హోటళ్లూ, కూల్‌డ్రింక్ షాపులతో అలంకరించుకున్న ఈ పల్లె నాది కానట్టుంది.

రచ్చబండకు అవతలి వైపు పాపమ్మబావిని చూద్దామని వెళ్లాను. రోడ్లు ఎత్తవడం వల్ల బావి నేలలోకి క్రుంగిపోయినట్లయింది. శిలాఫలకం జానెడు మేర బయటికి తొంగిచూస్తోంది. చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి వున్నాయి.

నీటి తడీ, తాడూ బక్కెట్ జాడే లేదు. ఎన్నో ఏళ్లుగా బావి వాడకంలో లేదని అర్థమవుతూనే వుంది.

గిలకల కిర్రు కిర్రులూ, గాజుల అలజడులూ చెవుల్లో మార్మోగుతుండగా నీళ్లలో నా ప్రతిబింబం కోసం బావిలోకి తొంగిచూశాను.

సుడిగాలి కెరటం బలంగా ముఖాన్ని తాకినట్టయింది. చటుక్కున కళ్లు మూసుకున్నాను. తీవ్రమైన అలజడికి గురవుతూ మళ్లీ చూశాను.

ఏముందక్కడ? బావినిండా మట్టీ బండరాళ్ళూ తప్ప. నేలమీదున్న ఒక్క వర మాత్రమే ఖాళీగా వుంది.

ఊహించని అనుభవానికి దుఃఖం తన్నుకొచ్చింది. నా కన్నీళ్లకి తడిసిన బావిలోని పిచ్చిమొక్క ఓదార్పుతో తలూపినట్టయింది.

బండరాళ్ల కింద పాపమ్మ ఆత్మ నలిగి మూలుగుతున్నట్లనిపించింది.

భారంతో అక్కడినుంచి కదిలి నా లగేజ్ దగ్గర కెళ్లి నిలబడ్డాను. అప్పటివరకూ నన్నే గమనిస్తున్నట్టున్నాడు ఆ షాపు యజమాని.

''ఆ బావిలో నీళ్లు లేవమ్మా ఇదుగో వాటర్ ప్యాకెట్. ఒక్క రూపాయే'' అన్నాడు.

అప్రయత్నంగా అందుకుని డబ్బులిచ్చి వెనుదిరిగే సరికి ఉష నవ్వుతూ నిలబడి వుంది''

''సారీ లేటయిందా? నీకోసం మా వాళ్లంతా ఎదురుచూస్తున్నారు. అన్నట్టు ఎలా వున్నావే?''

''అవన్నీ తర్వాత. ముందు పద'' అన్నాను.

**రోడ్డుపక్క పొలాల స్థానంలో కొన్ని డాబాలూ, ఒక దేవాలయం, చర్చీ, ప్రజా టెలిఫోన్లూ, చిన్న చిన్న హోటళ్లూ, కూల్‌డ్రింక్ షాపులతో అలంకరించుకున్న ఈ పల్లె నాది కానట్టుంది.**

రిక్షాలో వెళుతూ అడిగాను...

''ఉషా మనం పెరిగిన ఈ ఊరు గురించి నాకు గుర్తున్నదీ ఊహించిందీ వేరు. ఇన్నేళ్ల తర్వాత ఇక్కడ చూస్తున్నది వేరు.

ఆ పచ్చని పొలాలూ, పంట కాలువలూ, మన పాపమ్మ బావీ... ఏవీ మనవిగా లేవు. నేను భరించలేకపోతున్నాను తెలుసా?''

ఉష నా వైపు చూసి కాస్సేపు మౌనంగా వుంది. తర్వాత క్యాజువల్‌గా అంది–

''అవును. మార్పు సృష్టిలోనే కాదు. మన దైనందిన జీవితాల్లోనూ సహజమే. ఒకప్పుడు మనం పాపమ్మబావి నీళ్లనే బంగారంలా తాగాం. తర్వాత ఇళ్లముందుకే కుళాయిలొచ్చాయి. కాదని దూరం వెళ్లి బావి నీళ్లనే మోసుకొచ్చే ఓపిక ఎవరికుంది?

అన్నిట్లోనూ పొల్యూషన్ పెరిగిపోవటం వల్ల నీటివిషయంలో చిన్న సొల్యూషన్ అన్నట్టు ఇదిగో ఈ మినరల్ వాటర్.

ఈ మార్పులను మనం కాదనగలమా? ఉద్యోగాల పేరుతో సిటీలకు అలవాటు పడ్డ మనం పల్లెల్లో శాశ్వతంగా ఉండగలమా?

ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ అసౌకర్యాన్ని ఎంతకాలం భరిస్తాం? సౌందర్యాన్ని ఆటవిడుపుగా అనుభవిస్తేనే బాగుంటుంది''

ఉష పెద్ద లెక్చరిస్తూ వుంటే ''అది కాదే!'' అన్నాను అడ్డు తగులుతూ.

ఉష నన్ను పట్టించుకోకుండా అంది–

''అంతెందుకు? రెండు రోజులు పోయాక నువ్వే అంటావ్ చూడు. 'ఉషా' సెల్‌ఫోన్‌కి సిగ్నెల్ అందట్లేదు. మార్నింగ్ వాక్‌కి రోడ్డు బాలేదు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు అందుబాట్లో లేవు' అంటూ గోల చెయ్యవూ?''

దాని మాటలకు హాయిగా నవ్వేశాను.

* * *

రెండురోజుల తర్వాత తిరిగి ప్రయాణమవుతూ రచ్చబండ దగ్గర బస్ కోసం ఎదురుచూస్తున్నాను. ఉష ఏదో మాట్లాడుతూనే వుంది.

నా దృష్టి పాపమ్మ బావి దగ్గర ఆగింది. ఇద్దరు కూలీలు బావి గట్టుని కూలగొడుతున్నారు. మరో వైపున స్థలాన్ని కొలత వేస్తున్నారు. నేను చూస్తూ వుండగానే గట్టుని పూర్తిగా పడగొట్టి చదును చేశారు. ఆ రాళ్ల మధ్య ముక్కలైన శిలాఫలకం వెలవెలపోతూ వుంది.

ఒకప్పుడు అక్కడొక బావి వుండేదనీ, అది ఎంతోమంది దాహార్తిని తీర్చిందనీ , తర్వాత తరాల వారికి తెలిసే అవకాశం కూడా లేకుండా పోయింది.

ఉషకి బై చెప్పి బస్ ఎక్కాను. బస్ నెల్లూరు వైపు సాగిపోతుంటే అనుకున్నాను...

''తీయని జ్ఞాపకాలను మనసు పొరల్లో దాచి వుంచితేనే ఎప్పటికీ సజీవంగా వుంటాయి''

* * *

''అమ్మా నువ్వూ ఉషాంటీ మళ్లీ అప్పట్లా ఆడుకున్నారా మీ ఊర్లో?'' నా ఒళ్లో పడుకుని చీర కుచ్చిళ్లను లెక్కబెడుతూ అడిగింది మా పాప వర్ష.

ఇంటర్నెట్‌లో చాట్ చేస్తున్న పెద్ద కొడుకు ఒక్కసారి విసుగా మా వైపు చూసి –

''డోన్ట్ డిస్టర్బ్ వర్షా'' అంటూ మళ్ళీ కంప్యూటర్‌లో తల దూర్చాడు.

వర్ష తల నిమురుతూ ''లేదురా అప్పటికీ ఇప్పటికీ ఆ ఊర్లో చాలా మార్పులొచ్చాయి. నేనెప్పుడూ నీకు చెబుతూ వుండే విషయాలన్నీ ఇప్పుడు కేవలం జ్ఞాపకాలు మాత్రమే''

నువ్వు నాతో వచ్చినా చేపలు పట్టడానికీ, ఆడుకోవటానికీ కాలువలేదు. పాపమ్మ బావికూడా లేదు. పూడ్చేసిన ఆ బావిని నా కళ్లముందే పడగొట్టారు''

నేనెంతో బాధగా ఆ విషయాలన్నీ చెబుతూ వుంటే వర్ష చటుక్కున లేచి కూర్చుంటూ అడిగింది–

''ఎందుకమ్మా! పాపం పాపమ్మ వెల్‌ని అలా చేశారు? మరిప్పుడు ఆ విలేజ్ వాళ్లు వాటర్ ఎలా తాగుతారు పాపం. మనం మళ్లీ ఆ వెల్‌ని కట్టిద్దామా?''

తడిగా మెరుస్తున్న కళ్లతో అమాయకంగా అడుగుతూ వుంటే–

పాపమ్మ బావిలో ఆవిరైపోయిందనుకున్న మానవత్వపు తడి నా చిట్టితల్లి కళ్ళల్లో జీవనదిలా ఉబికి భావి తరాలకు ప్రవహిస్తున్నట్టుగా అన్పించి ముప్పిరిగొన్న ఆర్తితో వర్షని హత్తుకున్నాను.

★